క్లుప్తంగా

వాసుబాబు పరామర్శ



సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వాసుబాబు

నిడమర్రు: వైఎస్సార్ సీపీ నాయకుడు బువ్వనపల్లి గ్రామానికి చెందిన కొట్టు సత్యనారాయణ భార్య సత్యవతి ఇటీవల మరణించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సత్యవతి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. సత్యవతి చిత్రపటం వద్ద పువ్వులు వేసి నివాళులర్పించారు. ఆమె మృతికి కారణాలు అడిగి తెలుసుకుని, కుమారుడు రామాంజనేయులు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. వాసుబాబు వెంట పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు సంకు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్ సేవలు ఆదర్శనీయం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా శ్రీనివాస్ అందించిన సేవలు అభినందనీయమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.రవి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయ శ్రీనివాస్ దంపతులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆయన సేవలను కొనియాడారు.

యోగా జీవితంలో భాగం కావాలి



నర్సింగ్ కళాశాలలో యోగా చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, మారుతోన్న వాతావరణ, ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ప్రాథమిక స్థాయి నుంచే యోగా, వ్యాయామం వైపు దృష్టి సారించాలని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. గురువారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఉచితంగా యోగా శిక్షకులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 12 రకాల యోగాసనాలను నర్సింగ్ కళాశాల విద్యార్థులు 35నిమిషాలపాటు చేశారు.

విద్యార్థిని వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మానవత ప్రతినిధులు

భీమడోలు: ఏలూరులో 9వ తరగతి చదువుతున్న పోలసానిపల్లికి చెందిన మామిడి జ్ఞానేశ్వరి కొన్ని రోజులుగా కాలేయం పాడై తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కాలేయ మార్పిడికి రూ.25 లక్షల ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలసానిపల్లిలో బాలిక కుటుంబ సభ్యులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, అల్లాడ ప్రసాద్, చిలపర్తి ఆదినారాయణ, గోనుగుంట రమణశంకర్‌లు ఒక్కొక్కరూ రూ.1000 చొప్పున రూ.5 వేలు, చోడవరపు సత్యనారాయణ రూ.500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న సీఐ, ఎస్సైలు

భీమడోలు: యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ బీబీ రవికుమార్ అన్నారు. స్థానిక బీసీ కళాశాల హస్టల్‌లో గురువారంరాత్రి భీమడోలు ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఊపిరితిత్తుల కేన్సర్ డేను పురస్కరించుకుని కళాశాల యువకులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి పోతే అవయవాలు దెబ్బతిని ఆరోగ్యం పాడై క్యాన్సర్ వంటి ప్రాణాంకత వ్యాధుల బారిన పడతారని, నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని హెచ్చరించారు. వార్డెన్ ధనలక్ష్మి, పోలీస్, హస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు అమృతం

- నేటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు
- బిడ్డకు పాలిస్తేనే అమ్మకు ఆరోగ్యం
- రోగనిరోధకశక్తి పెంపొంది శిశువులకు శ్రేయస్కరం



తల్లి పాల వారోత్సవాల పోస్టర్

దెందులూరు: అమ్మ అనే పదంలోనే ఆప్యాయత, అనురాగం, మురిపెం మిళితమై ఉంటుంది. తల్లి పాలతోనే బిడ్డకు తొలి టీకా అందుతుంది. శారీరక ఎదుగుదలకు దోహదపడుతుంది. నవజాత శిశువుకు బలం చేకూరుస్తుంది. అయితే కొందరు తల్లులు పిల్లలకు ముర్రుపాలు పట్టేందుకు అయిష్టత చూపుతున్నారు. దీంతో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పౌష్టికాహార లోపంతో ఇబ్బందిపడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని వ్యాధులు సోకే ప్రమాదంలోకి వెళుతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఏటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. అమ్మపాల విశిష్టతపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది. నవజాత శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. నూరుశాతం పోషక విలువలున్న తల్లి పాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అందుకే తల్లి పాల ఆవశ్యతను వివరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ పద్మావతి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను సిబ్బంది వివరిస్తున్నట్టు చెప్పారు.

ఆరు నెలల పాటు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు తల్లిపాలు ఇవ్వాలి. ఆరు మాసాల తరువాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. కాన్పు అయిన మొదటి కొద్ది రోజుల పాటు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ఇందులో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుంది. విటమిన్ ఏ, బీలతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుంది. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారు. కామెర్లు, విరేచనాల వంటి రోగాల నుంచి తల్లిపాలు కాపాడతాయి.

ప్రయోజనాలివీ..

- తల్లిపాలలో ప్రొటీను లాక్టోఫిరిన్, కోల్‌స్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగనిరోధక బ్యాక్టీరియా ఉంటాయి.
- తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుంది. తెలివితేటలు అధికంగా ఉంటాయి. డబ్బా పాలు తాగే పిల్లలకంటే చురుగ్గా ఉంటారు.
- బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లి బిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది.
- తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయి. ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి.
- బిడ్డ దవడలు బాగా బలపడతాయి. తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.
- పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం రాకుండా గర్భనిరోధకంగా కూడా పనిచేస్తుంది.

బాధ్యతగా భావించాలి



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోకూడదు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలి. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటిది. వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– కేపీవీఎల్ పద్మావతి, పీడీ, ఐసీడీఎస్

శాకంబరిగా పెద్దింట్లమ్మ దర్శనం



పెద్దింట్లమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దెందులూరు: ఆషాఢమాసం సందర్భంగా గురువారం దెందులూరు శ్రీ పెద్దింట్లమ్మ ఆలయంలో ఆలయ కమిటీ వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: సూరప్పగూడెం వద్ద 33 కేవీ వీసీబీ నిర్మాణం చేస్తున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏలూరు డివిజన్ ఆపరేషన్ కార్యనిర్వాహక ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. భీమడోలు, సూరప్పగూడెం, పోలసానిపల్లి, గుండుగొలను, లింగంపాడు, కోరుకల్లు, రత్నాపురం, భోగాపురం, వడ్డిగూడెం, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటానని, ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో జరిగిన అన్ని విషయాలు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం పెదవేగి మండలం కొండలపాలెంలో ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి విచ్చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగిన ఘటనలను వారు వివరించారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, గ్రామ సర్పంచ్‌లు రఘు, ప్రభుదేవ, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలకృష్ణమూర్తికి నివాళి



గోపాలకృష్ణమూర్తి నివాసంలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్

దెందులూరు: బొమ్మనబోయిన గోపాలకృష్ణమూర్తి మృతి బాధాకరమని వ్యక్తిగతంగా, పార్టీ పరంగా తీరని లోటని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. గురువారం పోతునూరులో ఇటీవల మృతి చెందిన గోపాలకృష్ణమూర్తి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, మండల ఉపాధ్యక్షులు, నున్నా ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్ (బజ్జీ), తలారి రామకృష్ణ, బీశెట్టి నూకరాజు, గొరిపర్తి రంగారావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, కొమ్మిన రాము తదితరులు ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై అవగాహన



పెదపాడు : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ పాల్



గణపవరం : పీహెచ్‌సీలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్యాధికారి సంతోష్

పెదపాడు : బిడ్డపుట్టిన మొదటిగంటలో తల్లి పాలను అందించాల్సిన అవసరం ఉంటుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు పాల్, చక్రధర్‌లు తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో తల్లిపాల వారోత్సవాలపై పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు పాల్, చక్రధర్‌లు మాట్లాడుతూ బిడ్డకు మొదటి ఆరు నెలలూ తల్లిపాలనే అందించాలని, అనంతరం ఆహారం అందించాలని సూచించారు. తల్లిపాలు కనీసం రెండేళ్ల వరకు లేదా వీలైనన్ని రోజులు అందించాలన్నారు. ప్రసూతి ఆసుపత్రుల్లో తల్లిపాల సంస్కృతికి ఉన్న అంతరాలను తెలియజేశారు. సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

గణపవరం: తల్లిపాలు బిడ్డకు జీవితాంతం రక్షణగా ఉంటాయని, ప్రతితల్లీ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడంతోపాటు తల్లిపాలు పట్టాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. గురువారం గణపవరం పీహెచ్‌సీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్, హెచ్‌వీ సీహెచ్ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి తదితరులు పాల్గొన్నారు. తల్లిపాలు అమృత సమానమని, ప్రతి బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. పిప్పర పీహెచ్‌సీలో గురువారం తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమాజ దిశానిర్దేశకులు ఉపాధ్యాయులు



పదవీ విరమణ చేసిన హెచ్‌ఎంలను సత్కరిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు, నాయకులు



హెచ్‌ఎం పీవీ రామ్మోహనరావు, విశాలాక్షి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: సమాజానికి దిశానిర్దేశకులు ఉపాధ్యాయులేనని పలువురు కొనియాడారు. సాయన్నపాలెం పాఠశాల హెచ్‌ఎం సరిహద్దుల విజయకుమారి, పోలసానిపల్లి నెం.2 హెచ్‌ఎం పోతుకూరి విజయ రామ్మోహనరావుల పదవీ విరమణ నేపథ్యంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి భీమడోలు ఎంఆర్సీ వద్ద వారికి మెమెంటోలను అందించి ఘనంగా దుశ్శాలువాలతో సన్మానించారు. ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ నెల్సన్, ఎంఈఓ-2 అయినపర్తి భాస్కర్, హెచ్‌ఎం గారపాటి సునీత, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొని వారి సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు బాలభాస్కర్, ఎం శరీన్, మండే సుధాకర్, జగదీష్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ



నిడమర్రు : చానమిల్లిలో ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్న హెచ్‌ఎం శేషగిరిరావు



గణపవరం : బువ్వనపల్లి ప్రీ హైస్కూల్లో నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నిడమర్రు: మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా పాఠశాల నోటీస్ బోర్డులో ఓటరు జాబితాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పుచ్చల శేషు ఎన్నికల మార్గదర్శకాలు విడుదల చేశారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఆగష్టు 5 ఉదయం 9 నుంచి 10 గటల వరకూ ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించాలని, సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య తుది జాబితా ప్రకటించాలన్నారు. 8వ తేదీ ఉదయం 7 నుంచి 2 గంటల్లోపు ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తి చేసి, సాయంత్రం 3 గంటలకు నూతన కమిటీ తొలి సమావేశం నిర్వహించాలని వివరించారు. 8వ తేదీ ఉదయం 7 గంటలకే పాఠశాల పనివేళలు ప్రారంభించాలన్నారు. తరగతిని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్ ప్రకారం ముగ్గురు సభ్యులను ఎన్నుకుని వారి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక జరగాలన్నారు. తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకునిలో ఒక్కరికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని తెలిపారు.

బువ్వనపల్లి ప్రీస్కూల్లో..

గణపవరం: కొత్త ప్రభుత్వం ప్రకటించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్‌ను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విడుదల చేశారు. గణపవరం మండలంలో 40 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీలకు ఎన్నిక నిర్వహించనున్నారు. గురువారం మధ్యాహ్నం ఓటర్ల జాబితాలను హెచ్‌ఎలు ప్రకటించారు. వీటిపై అభ్యంతరాలను ఈనెల 5వ తేదీలోగా తెలియచేస్తే వాటిని పరిశీలించి, తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. 8వ తేదీన ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు. మధ్యాహ్నం సభ్యులంతా కలసి ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఎక్స్‌అఫీషియో సభ్యులు, కోఆప్టెడ్ సభ్యుల నియామకం అనంతరం తొలి ఎస్ఎంసీ సమావేశం ఎస్ఎంసీ కన్వీనర్ ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

ఉచిత కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ సర్టిఫికెట్టు కోర్సు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సులో కళాశాల విద్యార్థులు, చుట్టపక్కల గ్రామాల నిరుద్యోగ యువతీ యువకులు చేరవచ్చని పేర్కొన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు రూ.100, బయట వారు రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. 45 రోజుల పాటు బేసిక్ కంప్యూటర్స్, ఎమ్మెస్ ఆఫీస్, ఎక్సెల్, పవర్ పాయింట్, ఈ మెయిల్, పీపీటీ తదితర సబ్జెక్టులు నేర్పించి, పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ ఇస్తారని వివరించారు. పూర్తి వివరాలకు కళాశాలలో నేరుగా లేదా ఫోన్ నెంబర్ 98663 55120లో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు తెలిపారు.

జోరుగా మోటారు సైకిళ్ల చోరీలు



ఏలూరు జీజీహెచ్‌లో మోటారు సైకిల్స్ పార్కింగ్ (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మోటారు సైకిళ్ల చోరీలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో ఇంటి బయట పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లు సైతం అపహరణకు గురవుతుండడంతో వాహనదారు లు లబోదిబోమంటున్నా రు. ఏలూరు నగరంలో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ ప్రతి ప్రాంతంలోనూ మోటారు సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో ఏమి చేయాలో తెలియక వాహనదారులు ఆవేదనకు గురవుతున్నారు. ఒకవైపు ఇళ్లలో చోరీలు, మరోవైపు మోటారు సైకిళ్ల అపహరణతో పరిస్థితి గందరగోళంగా మారింది.

పట్టించుకోని పోలీసులు

ఏలూరు నగరంలో ఇష్టారాజ్యంగా చోరీలు జరుగుతున్నా పోలీస్ అధికారులు పెద్దగా పట్టించుకోవటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు నెలల కాలంలోనే పదుల సంఖ్యలో వాహనాలు చోరీలకు గురికావటంతో వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు జీజీహెచ్‌లో సైతం మోటారు సైకిళ్ల అపహరణకు గురికావటం గమనార్హం. దొంగలు సీసీ కెమెరాలు లేని చోట్ల చోరీలకు పాల్పడుతూ పోలీసులకు దొరకకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఏలూరు నగరంతోపాటు, ఇతర ప్రాంతాలకు చెందిన నేరగాళ్లు చోరీలకు పాల్పడుతున్నట్టు చెబుతున్నారు. నేరాలకు పాల్పడుతున్న వారిపై పోలీస్ నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రతి రోజూ రెండు మూడు చోట్ల మోటారు సైకిళ్లు మాయం కావటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఏలూరు జీజీహెచ్‌లో గత నెల 24న మోటారు సైకిళ్ల చోరీలపై బాధితులు గగ్గోలు పెట్టగా ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్ వెంటనే స్పందించి ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో వాహనాల భద్రతకు సంబంధించి ఏలాంటి చర్యలు చేపట్టారో ఆరా తీశారు. ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు హాస్పిటల్‌లోని సెక్యూరిటీ విభాగంలో పని చేస్తోన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల నిఘాపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని హాస్పిటల్ యాజమాన్యానికి సూచించారు.
- ఏలూరు రూరల్ పరిధిలో జూలై నెలలో ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన మోటారు సైకిల్ అపహరణకు గురైంది. వన్‌టౌన్‌లోనూ ఇదే తరహాలో తాళాలు వేసి ఉన్న సైకిళ్లు చోరీకి గురవటంతో వాహనదారుల ఆందోళనకు గురవుతున్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఏలూరు నగరంలో వరుసగా చోటుచేసుకుంటున్న చోరీలపై జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాలతో పోలీస్ అధికారులు అప్రమత్తం అవుతున్నారు. ఏలూరు నగరంలోని మూడు సర్కిల్స్‌తోపాటు, సీసీఎస్ పోలీస్ అధికారులు దొంగతనాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఏలూరు నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ నిఘాను మరింత పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు స్పష్టం చేశారు. రెస్టారెంట్లు, ప్రధాన కూడళ్లు, హోటల్స్, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా నేరాలను అదుపు చేసే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.